క్లుప్తంగా

పద్మశ్రీ అవార్డు గ్రహీతకు సన్మానం



మందకృష్ణకు జ్ఞాపిక అందిస్తున్న జిల్లా ఎమ్మార్పీఎస్ నేతలు

ఆసిఫాబాద్అర్బన్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ ఇటీవల పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. వరంగల్‌లోని కాళోజీ కళాక్షేత్రంలో శనివారం రాత్రి జరిగిన జాతీయస్థాయి కార్యవర్గ సమావేశంలో జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు రేగుంట కేశవ్‌రావ్, తదితరులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. నాయకులు యశోద, మహేశ్, కృష్ణవేణి, శ్రావణ్, ప్రతాప్ తదితరులు ఉన్నారు.

నేడు ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

దహెగాం: మండలంలోని ఇట్యాల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరిస్తున్నట్లు ఆరే సంక్షేమ సంఘం గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ విగ్రహావిష్కరణకు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు రానున్నారని పేర్కొన్నారు. ఆరె సంఘం నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేడు సమావేశం

కెరమెరి: మండలంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఉదయం 8 గంటలకు పార్టీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు ఆత్రం కుసుంబ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆవిర్భావ వేడుకల సందర్భంగా జెండా ఆవిష్కరణ అనంతరం సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరుకావాలని కోరారు.

రేపు యోగా శిక్షణ కేంద్రం ప్రారంభం

కౌటాల: మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో మంగళవారం యోగా ధ్యాన శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు డోంగ్రే సురేష్ తెలిపారు. జన భవిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత యోగా ధ్యాన శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు కేంద్రాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. స్టేడియంలో ప్రతీరోజు 5 నుంచి 6.30 గంటల వరకు యోగాపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8978783124 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పరామర్శ

తిర్యాణి: మండలంలోని ఇర్కపెల్లికి చెందిన ఉపాధ్యాయుడు కుర్సెంగ భీంరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆదివాసీల అభ్యున్నతికి భీంరావు చేసిన సేవలను ఆమె కొనియాడారు.

పాఠశాల పునఃప్రారంభించాలి



మూతపడి ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి-హెచ్ పంచాయతీ పరిధిలో దమ్మనగర్ (ఎస్సీ కాలనీ)లో ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాల మూతపడింది. విద్యార్థులు లేరనే కారణంతో 11 ఏళ్ల క్రితం విద్యాశాఖ అధికారులు తప్పుడు నివేదికతో మూసివేయించారు. అప్పటికి విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థుల సంఖ్యతోపాటు సమస్య వివరించినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో 30 మంది చిన్నారులు ఉన్నారు. నిరుపేద దళిత కుటుంబాలు కావడంతో ప్రైవేట్ బడిలో చదివించుకోలేక 2 కి.మీ దూరంలో కొత్తపల్లి హెచ్ తండాలోని ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్నారు. ప్రతీరోజు కాలినడకన వెళ్లి వస్తున్నారు. 30 మంది విద్యార్థులు ఉన్నందున పాఠశాలను పునఃప్రారంభించాలని విద్యాశాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునేనాథుడే కరవయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి కొత్తపల్లి-హెచ్ (దమ్మ నగర్) ఎస్సీ కాలనీ ప్రభుత్వ పాఠశాలను పునః ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కాగా, ఎంఈవో పవార్ అనిత వివరణ కోరగా, పాఠశాల పునఃప్రారంభించాలని గ్రామస్తులు వినతిపత్రం అందజేసిన మాట వాస్తవమన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లామన్నారు. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. అప్పటివరకు పక్కా గ్రామంలో ఉన్న పాఠశాలలో చేర్పించాలన్నారు.







పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

రెబ్బెన: మండల కేంద్రం నడిబొడ్డున ఉన్న ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణలో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోయింది. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. గెస్ట్‌హౌస్ పరిసరాల్లో కూరగాయలు, పండ్ల వ్యాపారులు వ్యర్థాలు పడేస్తుండంతో అవి కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ప్లాస్టిక్ కవర్లు, తాగిపడేసిన కొబ్బరిబొండాలు, కూరగాయల వ్యర్థాలతో పరిసరాలు నిండిపోవడంతో అటువైపు నివాసం ఉండే కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నాయి. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని మండలవాసులు వాపోతున్నారు.

ఆదమరిస్తే ప్రాణాలకే ముప్పు



పాతగూడ వంతెన వద్ద ప్రమాదకరంగా రోడ్డు

- వరదలకు పలుచోట్ల ధ్వంసమైన సర్కేపల్లి రహదారి
- ప్రమాదకరంగా మారిన ప్రయాణం
- మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న ప్రజలు

వాంకిడి: మూడేళ్ల క్రితం వచ్చిన వరదలకు సర్కేపల్లి గ్రామానికి వెళ్లే రహదారి పలుచోట్ల ధ్వంసం కాగా మరమ్మతులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఖమాన గ్రామం నుంచి సర్కేపల్లి వరకు రూ.7 కోట్లతో ప్రధానమంత్రి సడక్ యోజన పథకంలో భాగంగా డబుల్ బీటీ రోడ్డు మంజూరైంది. దాదాపుగా 9 కిలో మీటర్ల రహదారి నిర్మించాల్సి ఉండగా 2020లో సదరు కాంట్రాక్టర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఖమాన గ్రామం నుంచి మారెపల్లి వరకు సుమారు ఆరున్నర కిలోమీటర్లు రోడ్డు నిర్మించారు. అటవీ అనుమతులు లేక మిగిలిన 2 కిలోమీటర్ల రోడ్డు పనులు నిలిచిపోయాయి. మారెపల్లి నుంచి సర్కేపల్లి గ్రామం వరకు పనులు పూర్తి చేయాల్సి ఉంది. అయితే పూర్తయిన ఆరున్నర కిలోమీటర్ల రహదారి గత మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు వరదలు పోటెత్తడంతో పలుచోట్ల ధ్వంసమైంది. ప్రస్తుతం ఆ ప్రాంతాలు ప్రయాణికులకు ప్రమాద సంకటంలా మారాయి. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే అధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పలుచోట్ల పొంచి ఉన్న ప్రమాదం..

సర్కేపల్లి రహదారి గుండా పలుచోట్ల ప్రమాదం పొంచి ఉంది. పాతగూడ గ్రామ సమీపంలోని వాగుపై గల వంతెన అప్రోచ్ వరదల ధాటికి ప్రమాదకరంగా మారింది. గతంలో అప్రోచ్ కొట్టుకుపోగా మట్టితో పూడ్చేశారు. మళ్లీ ఇటీవల వచ్చిన చిన్నపాటి వర్షానికే సగభాగం కాలువలా ఏర్పడింది. రాత్రిపూట ప్రయాణించే వాహనదారులు అదుపుతప్పి పడిపోతే ప్రాణనష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. లక్ష్మీపూర్ గ్రామ సమీపంలోని ఒర్రె వద్ద రోడ్డు తీవ్రస్థా యిలో ధ్వంసమైంది. ఆ ప్రాంతం మూలమలుపు వద్ద ఉండటంతో ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి ఉంది. దీనికి తోడు ఆ ఒర్రె వద్ద నుంచి గ్రామం వరకు సీసీ రోడ్డు నిర్మించగా ఒక వైపు లోతు ప్రాంతం ఉంది. కొంచెం అదుపు తప్పినా ప్రాణాలు గాల్లో కలవడం ఖాయంలా పరిస్థితి ఉంది. దీంతో సీసీరోడ్డుకు ఒక వైపు రక్షణ గోడ లేదా పోల్స్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. లైన్‌గూడ, మారెపల్లి మధ్యలో చిన్న ఒర్రెపై కల్వర్టు నిర్మించకుండా ఒకపైప్ వేసి పైనుంచి బీటీ రోడ్డు వేశారు. దీంతో ప్రస్తుతం అక్కడ బీటీ తేలిపోవడంతో సిమెంట్ పైప్ బయటకు వచ్చింది. ఒక వైపు రోడ్డు సైతం కోతకు గురైంది. మారెపల్లిలో వేసిన సీసీ రోడ్డు, సీసీ సైడ్ డ్రెయిన్లు సైతం నాలుగేళ్లకే పాడైపోయాయి. అధికారులు ప్రమాదకరంగా మారిన ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. దీనిపై ఫోన్ ద్వారా ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులను వివరణ కోరగా మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు.



మారెపల్లి సమీపంలో బయటపడ్డ సిమెంట్ పైప్

మరమ్మతులు చేపట్టాలి..



రహదారి గుండా అనేక చోట్ల ప్రమాదం పొంచి ఉంది. గతంలో కురిసిన వర్షాలకు వరదలు ఉప్పొంగడంతో వాగులు, ఒర్రెలపై ఉన్న వంతెనల వద్ద రోడ్డు ధ్వంసమైంది. రాత్రిపూట ప్రయాణమంటేనే భయంగా ఉంటుంది. అధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. అలాగే సర్కేపల్లి వరకు రోడ్డు పనులు పూర్తి చేయాలి.

–జగన్నాథ్‌రావు, సర్కేపల్లి

ప్రమాదాలు జరిగే అవకాశం



పలు ప్రాంతాల్లో రహదారి కోతకు గురైంది. కొత్త వారు ఈ రోడ్డు గుండా వస్తే ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దాదాపు మూడేళ్ల క్రితం రోడ్డు ధ్వంసం కాగా సరైన మరమ్మతులు చేపట్టలేదు. ఇప్పటికైన పకడ్బందీగా మరమ్మతులు చేపట్టాలి.

– సోయం జగన్, సోయంగూడ

ఇదీ రోడ్డే!



మట్టి రోడ్లు వర్షాకాలంలో బురదగా మారుతుంటాయి. బురద నుంచి ఇబ్బందులు తొలగడానికి సిమెంట్ రోడ్లు నిర్మిస్తారు. మండలంలోని గూడెం గ్రామంలో ప్రభుత్వ నిధులతో పలు సీసీ రోడ్లు నిర్మించారు. కాని గ్రామంలో ఈ రహదారులు సైతం బురద చేరి ప్రజలకు ఇబ్బంది తప్పడం లేదు. గ్రామంలోని జీసీ వాడలో ఇటీవల నిర్మించిన సీసీరోడ్డుపై బురద నీరు నిలుస్తోంది. సుమారు 50మీటర్ల దూరం వరకు బురద నీరు నిలిచిపోవడంతో గ్రామస్తులు ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– చింతలమానెపల్లి

‘రైతులకు అన్యాయం చేస్తే ఓసీపీని అడ్డుకుంటాం’



మాట్లాడుతున్న రాజకీయ పార్టీల నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా సింగరేణి యాజమాన్యం నూతనంగా ఏర్పాటు చే యబోయే గోలేటి ఓసీపీలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లింపుల్లో అన్యా యం చేయాలని చూస్తే ఓసీపీని అడ్డుకుంటామ ని రాజకీయ పార్టీల నాయకులు హెచ్చరించారు. ఆదివారం గోలేటి టౌన్‌షిప్‌లోని వారసంత స్థలంలో రైతులు, రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, బీఆర్‌ఎస్ నాయకుడు తోట లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకుడు కిషన్‌గౌడ్, ఏఐటీయూసీ నాయకుడు ఉపేందర్ మాట్లాడుతూ గోలేటి ఓసీపీ ఏర్పాటులో ముంపునకు గురయ్యే భూములకు ఎకరాకు రూ.70 లక్షలు చెల్లించడంతోపాటు కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెవన్యూ, సింగరేణి అధికారులు కుమ్మక్కై, గోలేటి శివారులో ఉన్న భూములకు తక్కువ విలువ చూపించి రైతులకు అన్యాయం చేయాలని చూస్తున్నారని అన్నారు. గోలేటి పరిసరాల్లో మార్కెట్ విలువ సుమారు రూ.20 లక్షల వరకు ఉన్నప్పటికి కేవలం రూ.2.5 లక్షలుగా చూపించి ముంపునకు గురయ్యే భూములకు రూ.7.5 లక్షలు మాత్రమే చెల్లించేందుకు యాజమాన్యం కుట్రలు చేస్తోందన్నారు. నాయకులు రాయిల్ల నర్సయ్య, నవీన్‌గౌడ్, తిరుపతి, మల్లయ్య, రైతులు రాజేందర్, సురేందర్, శంకర్, ధర్ము, లచ్చు పటేల్, శేఖర్, రమేశ్, మహేశ్ పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని బాలబారతి ఉన్నత పాఠశాలలో 2004-05 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. వీరి అపూర్వ సమ్మేళనానికి పాఠశాల వేదికైంది. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. పాఠశాల కరస్పాండెంట్ వసీమ్, పూర్వ ఉపాధ్యాయులు ఇందిరారాణి, స్వర్ణలత, సంతోష్, గోవిందచారి, గంగాధర్, స్వాతి, స్వర్ణలక్ష్మి, స్వాతి, చటర్జి, స్వప్న, నరేశ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



రెబ్బెన: మండలంలోని నంబాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2011-12 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. మండల కేంద్రంలోని కేకే గార్డెన్స్‌లో అపూర్వ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. పాఠశాలలో గడిపిన మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించారు.

ఎంఈవోకు సన్మానం

ఆసిఫాబాద్‌రూరల్: ఎంఈవో రాథోడ్ సుభాష్ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఎంఈవోల శిక్షణలో మల్టీజోన్-1లో ఉత్తమ ఎంఈవోగా ఎంపికైన సందర్భంగా ఆదివారం యూటీఎఫ్ అధ్వర్యంలో ఆయన్ను సన్మానించారు. జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి, జిల్లా కార్యదర్శి కమలాకర్‌రెడ్డి, ఎస్‌వో మధుకర్, నాయకులు ఊశన్న, హేమంత్, రమేశ్, సంతోష్ తదితరలు పాల్గొన్నారు.

వంగిన స్తంభం



ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బూర్గుడ సమీపంలోని పంట చేలలో ఇటీవల కురిసిన గాలివానకు విద్యుత్ స్తంభం వంగి ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని రైతులు భయం దోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి స్తంభాన్ని సరిచేయాలని వారు కోరుతున్నారు.

గుడుంబా స్థావరాలపై దాడి

దహెగాం: మండలంలోని మర్రిపల్లి శివారులో ఆదివారం గుడుంబా స్థావరాలపై ఎస్సై విక్రమ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించా రు. గ్రామ శివారు పంట పొలాల్లో గుడుంబా తయారు చేస్తున్నట్లు గుర్తించి బెల్లం పానకా న్ని ధ్వంసం చేశారు. 100 లీటర్ల బెల్లం పా నకం పారబోశామని ఎస్సై తెలిపారు. గ్రా మాల్లో గుడుంబా విక్రయించినా, తయారు చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామ ని హెచ్చరించారు. ఈయన వెంట సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ తీగలకు తాకి రెండు గేదెలు మృతి

తిర్యాణి: మండలంలోని రొంపెల్లి శివారులో ని గిన్నెబండ అటవీ ప్రాంతంలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి రెండు గేదెలు మృత్యువాత ప డ్డాయి. అటవీ జంతువుల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలకు తగలి మృతిచెందాయ ని బాధితులు కుర్సింగ గంగోలి, ఆత్రం జగ్గరావు పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు

జోడేఘాట్‌కు సందర్శకుల తాకిడి



ఆభరణాలను తిలకిస్తున్న ఆదివాసీలు

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌లో ఆదివారం సందర్శకుల తాకిడి కనిపించింది. తిర్యాణి మండలంలోని గోవింద్‌పూర్, కేరేగూడ గ్రామానికి చెందిన ఆదివాసీలు భీం మ్యూజియాన్ని తిలకించారు. ఆదివాసీలతో ముచ్చటిస్తున్న భీం, నృత్యాలు చేస్తున్న గుస్సాడీల ప్రతిమలను చూసి మంత్రముగ్ధులయ్యారు. ఆదివాసీల ఆభరణాలు, గతంలో వాడిన పనిముట్లు, విల్లులు, ఆదివాసీల దేవి దేవతల ఆలయాలను తిలకించారు. అంతకుముందు కుమురం భీమ్‌కు పూలమాల వేసి నివాళిర్పించారు. సమాధికి పూజలు చేశారు.



చిత్రమాలికలను చూస్తున్న మహిళలు